క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు రూ.3.51 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఝరాసంగం మండలానికి చెందిన కమబాపల్లికి చెందిన వితబాయికి రూ.30 వేలు, నీలమ్మకు రూ. 60 వేలు, ఎల్గోయికి చెందిన సమీన బేగంకు రూ. 51 వేలు, బుజ్జమ్మకు రూ. 42 వేలు, మాచ్‌నూర్‌కు చెందిన తహేరాబేగంకు రూ.39 వేలు, ఏడాకులపల్లికి చెందిన సూర్య ప్రకాష్‌కు రూ.54 వేలు, చిల్కేపల్లికి చెందిన నగేష్‌కు రూ. 51 వేలు, వనంపల్లికి చెందిన కమలమ్మకు రూ. 24 వేల చెక్కును అందజేశారు.

చెక్కుల పంపిణీ

పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ



సామూహిక అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెం పరిధిలోని (బొంతపల్లి) భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని ద ర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సామూహిక రుద్రాభిషేకాలు, వ్రతాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఈఓ శశిధర్ అన్ని ఏర్పాట్లు చేశారు.

దెబ్బతిన్న పత్తి పంట



పత్తి పంటలో నిలిచిన వరద

మునిపల్లి(అందోల్): ఎడతెరిపి లేని వర్షాలకు పత్తిలో నీరు నిలిచి పంట పాడైయింది. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు ఎర్రబారి ఎర్రనల్లితో పత్తి పంట ఉండడంతో మందులు పిచికారీ చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పత్తి పంటలో నీరు నిలిచి పత్తి మొలకలు ఎర్రబారి నెల కొరిగాయి. పంట దెబ్బతినడంతో రైతులు అందోళన చెందుతున్నారు. పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

గోమాతకు అంత్యక్రియలు

నారాయణఖేడ్: మండలం పరిధి జగన్నాథ్‌పూర్ గ్రామంలో ఆదివారం మృతి చెందిన గోమాతకు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ హనుమాన్ మందిరానికి చెందిన ఆవు ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామస్తులంతా ఒక్కటై భజనలు చేస్తూ పూజలు నిర్వహించారు. గోమాతకు చివరిసారిగా హారతులు ఇచ్చి, శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపారు.

ఉచిత వైద్య శిబిరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని విద్యాభారతి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు సి. గోదావరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఆమేధ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్ రెడ్డి, మల్లేశ్, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్ గేట్ సమీపంలోని ఆయా ఆలయాల్లో శ్రావణమాసం చివరి సోమవారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్, ఓంకార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం ఉ. 5 గంటల నుంచి 7:00 వరకు స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు అలంకరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఇంటర్‌లో పెరిగిన ప్రవేశాలు

జహీరాబాద్‌లో అత్యధిక అడ్మిషన్లు
- ఈ నెల 20 వరకు గడువు
- మరిన్ని ప్రవేశాలు పెరిగే అవకాశం

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు వెళ్లకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు చేపట్టింది. కళాశాలల్లో పూర్తిస్థాయిలో అధ్యాపకుల నియామకం, సీసీ కెమెరాల ఏర్పాటు, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేయడంతో పాటు అధ్యాపకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో విద్యార్థులు ప్రవేశాలు పెరిగాయి.

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, గురుకుల, ప్రైవేట్ కళాశాలలు 100కు పైగా ఉన్నాయి. గత ఏడాది ఆయా కళాశాలల్లో సుమారు 16వేల మంది విద్యార్థులు చేరారు. అందులో 3,350 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని ఇంటర్మీడియేట్ అధికారులు నిర్ణయించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టారు.



హద్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

గ్రామాల్లో విస్తృత ప్రచారం

ఇంటర్మీడియెట్ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని అధ్యాపకులు, సిబ్బంది కళాశాలల ప్రారంభానికి ముందే మే మాసంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లిన వారు ప్రభుత్వ కళాశాలల్లో చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉత్తమ ఫలితాలు తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులను అక్కడే తాత్కాలికంగా అడ్మిషన్ చేసుకున్నారు. ఇలా సుమారు 10 రోజుల పాటు అధ్యాపకులు, సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించడంతో కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది 1327 మంది అధికంగా ప్రవేశం పొందారు. విద్యార్థుల సౌకర్యార్థ ఇంటర్‌లో ప్రవేశాల గడువును ప్రభుత్వం ఈనెల 20 వరకు పొడిగించింది.



మామిడ్గి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు(ఫైల్)

ఇంటింటి ప్రచారం చేశాం



గ్రామాలకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాం. వారి నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో వారి ఇంటి వద్దే అడ్మిషన్ చేసుకున్నాం . తర్వాత వారు కళాశాలకు వచ్చి పూర్తిస్థాయి అడ్మిషన్ తీసుకున్నారు.

–అర్జున్, అధ్యాపకుడు, హద్నూర్

4677 మంది చేరిక



జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో 3,350 మంది విద్యార్థులు చేరారు. ఈ ఏడాది 4,677 మంది అడ్మిషన్ అయ్యారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 1327 విద్యార్థులు అధికంగా చేరారు. అడ్మిషన్ గడువును ఈనెల 20 వరకు పొడించినందునా ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

–గోవిందరాం, డీఐఈఓ, సంగారెడ్డి

బురదరోడ్లపై నాట్లు వేసి నిరసన

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని 8వ వార్డు హనుమాన్‌నగర్ కాలనీలో రోడ్డు బురదమయంగా మారాయి. దీంతో ఆదివారం కాలనీవాసులు ఆ రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. గత 20 ఏళ్ల నుంచి కాలనీలో సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రధాన అంతర్గత రహదారులు చిన్నపాటి వర్షానికే బురదమయంగా అవుతున్నాయని అన్నారు. కనీసం నడవడానికి కూడా వీలు కావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు మారుతున్నా కాలనీ రూపురేఖలు మారడం లేదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీ రోడ్లన్నీ బురదమయంగా మారి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోవర్ధన్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రేమ్ సాయి రెడ్డి, వర్షిత్రెడ్డి భాను యాదవ్, కౌశల్ రెడ్డి, ఆకాష్, యశ్వంత్ యాదవ్ తదితర యువకులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకరెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీలో కష్టపడే యువతకు సముచిత స్థానం ఉంటుందనే ఉద్దేశంతో పార్టీలో చేరడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, హనుమంత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రాజు, సత్యనారాయణ, సదానంద రెడ్డి, సంజీవరెడ్డి, మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టండి

పటాన్‌చెరు: భానూర్ నుంచి క్యాసారం వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వర్షాలకు కొట్టుకుపోయి గుంతలు పడ్డ రహదారిని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. వర్షానికి కొట్టుకుపోవడం, గుంతలు పడడం వల్ల నిత్యం ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగులు, పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాకాలం ముందే రోడ్లను మరమ్మతు చేపట్టాల్సిన అధికారులు నిద్రపోతున్నారా అని ఆరోపించారు. రోడ్లు బాగాలేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. నిత్యం ఈ రహదారి గుండా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు కేటాయించి రహదారికి మరమ్మతులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ నాయకులు సుధాకర్, యాదగిరి, లక్ష్మారెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గోపీ భావమే కృష్ణ భక్తి

జహీరాబాద్ టౌన్: గోపీ భావమే కృష్ణ భక్తి పరమార్థమని కంది హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభిషణ్ ప్రభుజీ అన్నారు. హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 168వ నగర సంకీర్తన అట్టహాసంగా జరిగింది. శ్రీరామ మందిరం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర హనుమాన్ మందిరం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడికి గోపికలు అత్యంత ప్రీతిప్రాతమైన భక్తులన్నారు. నిష్కలమైన ప్రేమను కురిపించి వారు భగవంతుడి సాన్నిహిత్యాన్ని పొందరాని చెప్పారు. ఆ భక్తిని సాధించడానికి అనునిత్యం హరేకృష్ణ మంత్ర జపం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొన్నారు. మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో కూడా నగర సంకీర్తన శోభయాత్ర నిర్వహించారు.



శోభాయాత్రలో చిన్నారుల కోలాటం

మండపాలకు అనుమతి తప్పనిసరి

ఎస్‌ఐ సుజిత్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఆయా గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసే వారు ముందస్తు అనుమతి తీసుకోవాలని హద్నూర్ ఎస్ఐ దోమ సుజిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో అందించాలన్నారు. మండపాల వద్ద పోలీసు భద్రతను కల్పిస్తామని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ

జహీరాబాద్‌టౌన్: మండలంలోని బూచినెల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు కొత్తరేషన్ కార్డులు పంపిణీ చేశారు. గ్రామానికి 30 కార్డులు మంజూరు కాగా 110 మంది పేర్లను చేర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దశరథ్, ఖలీల్, ముజీబ్, లాజర్, అజీమ్, మహేశ్, తుల్జరాం, ఖాదర్ పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 18న సోమవారం తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. మనూరు మండలం బోరంచ ఎస్‌పీపీ సెగ్మెంట్ ద్వారా తాగునీటి సరఫరా అవుతుంది. భారీ వర్షాల కారణంగా మంజీరా నదిలో వాటర్ టర్బిడిటీ ఎక్కువగా ఉండి, కొత్త నీరు బురదమయంగా మారింది. సమస్యను పరిష్కరించి స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు. పట్టణ వాసులు సహకరించాలని కోరారు.

రిజర్వేషన్లు ఇవ్వాలి

హుస్నాబాద్‌రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ అన్నారు. హుస్నాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చేసి న తీర్మానానికి కట్టుబడి స్థానిక ఎన్నికల్లో నిర్వహించాలన్నారు. రిజర్వేషన్ల అమ లుకు ఎలాంటి న్యాయపరమైన సమస్యలు రాకు ండా అమలుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

కేతకీలో శ్రావణ పూజలు



దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వరాలయంలో భక్తులు శ్రావణమాసం పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, గుండంలోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్నారు.

ఆర్థిక సహాయం

మునిపల్లి(అందోల్): పైచదువులకు మంత్రి దామోదర ఆర్థిక సహాయం చేసినట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కురుమ మహేశ్ తెలిపారు. ఆదివారం మండలంలోని మల్లికార్జునపల్లికి చెందిన ట్రైడ్ ఆర్టిస్ట్ డి. జహంగీర్ పాషా మంత్రి దామోదర రాజనర్సింహ్మను కలిసినట్లు తెలిపారు. పైచదువులకు ఇబ్బంది పడుతున్నానని ఆర్థిక సహాయం చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన ఆయన ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు.

డెంగీ బాధితురాలికి ప్లేట్‌లెట్స్ దానం

నారాయణఖేడ్: ఖేడ్‌కు చెందిన బేబీ అఫ్రా డెంగీ జ్వరం బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు అత్యవసరంగా 'ఓ' నెగిటివ్ ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉందని నిర్ధారించారు. ఆగ్రూపునకు సంబంధించిన ప్లేట్‌లెట్స్ అందుబాటులో లేకపోవడంతో బాధితురాలి కుటుంబీకులు ఖేడ్ బ్లడ్ డోనర్స్‌గ్రూపు సహకారం కోరారు. అదే గ్రూపు రక్తం గల బ్లడ్ డోనర్స్ గ్రూపు సభ్యులు, సామాజిక సేవా కార్యకర్త ఓంప్రకాష్ స్పందించి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి తన ప్లేట్‌లెట్స్‌ను దానం చేశారు. ఆయన రక్తదానం చేయడం ఇది 49వ పర్యాయం కావడం గమనార్హం.



ప్లేట్‌లెట్స్ దానం చేస్తున్న ఓంప్రకాష్

పెరిగిన భూగర్భ జలాలు



ఓపెన్ బావిలో పైకి వచ్చిన నీరు

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాలకు నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెరిగాయి. అడుగంటిన ఓపెన్ బావుల్లో నీరు పైకి ఉబికి వస్తుంది. నియోజకవర్గంలో శాశ్వత నీటి వనరులు లేనందున రైతులు బోర్లు, బావులపై ఆధారపడి పంటలు పండిస్తుంటారు. ఎకరం పొలం ఉన్న రైతు కూడా బోరు వేసి చెరకు, అల్లం, ఆలు తదితర వాణిజ్య పంటలను పండిస్తున్నారు. కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురవడంతో జహీరాబాద్ ప్రాంతంలోని ప్రధాన ప్రాజెక్టు నారింజ పూర్తిగా నిండింది. చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయి. విరివిగా వర్షాలు పడినందున భూగర్భ జలాలు పెరిగి పాతళ గంగా పైపైకి వస్తుంది. పట్టణంలోని రంజోల్‌లోని నక్షత్ర వెంచర్‌లోని బావిలో నీరు పైకి వచ్చింది. నారింజ ప్రాజెక్టు పరిధిలోని బోరు బావుల్లో కూడా నీటి మట్టం పెరిగింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లోక కల్యాణార్థం పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం భక్తులు కోహీర్ రాచన్నస్వామి దేవాలయం వరకు పాదయాత్రగా బయలు దేరారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ ఆదివారం పట్టణంలో పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ఇప్పెపల్లి నర్సింలు ,ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని లోక కళ్యాణార్థం గత మూడు సంవత్సరాల నుంచి సమాజ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ నుంచి బడంపేట రాచన్న స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న శివకుమార్ తదితరులు

హాస్టళ్ల అక్రమాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

నారాయణఖేడ్: సంక్షేమ వసతిగృహాల్లో బోగస్ విద్యార్థుల సంఖ్య అప్రూవ్ చేయించడం.. వార్డెన్ల వద్ద డబ్బులు వసూలు చేసిన అంశంపై ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ జరిపారు. ×సాక్షి¥ దినపత్రికలో ఈనెల 15న ×హాస్టళ్లలో తప్పుడు లెక్కలు¥ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇంటెలిజెన్స్ అధికారులు స్పందించి విచారణ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు సైతం ఈ అంశంపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది. హాస్టళ్లలో విద్యార్థులు లేకున్నా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇంటి వద్ద ఉంటున్న, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల పేర్లను నమోదు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అలాగే, వార్డెన్ల వద్ద డబ్బులు వసూలు చేసిన అంశంపై ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించారు. సదరు అధికారిని సైతం అధికారులు విచారించగా తాను డబ్బులు వసూలు చేయలేదని తప్పించుకునే ప్రయత్నం చేయగా కొందరు వార్డెన్లు చెప్పిన వివరాలు వెల్లడించడంతో ఒప్పుకున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ నివేదిక జిల్లా అధికారులకు అందిన తదుపరి చర్యలకు ఉపక్రమించనున్నారు.

ముళ్లకంచెలు, చెట్ల తొలగింపు

నారాయణఖేడ్: మనూరు మండలాల్లోని పలు గ్రామాల్లో కురిసిన వర్షం నీరు ఖేడ్ పక్కనున్న వాగు నుంచి దిగువకు ప్రవహిస్తోంది. ఈ వాగుపై లోలెవల్ కాజ్‌వే ఉంది. భారీ వర్షం కురిస్తే లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరదనీరు పారుతుంది. దీంతో వివిధ ప్రాంతాలకు గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగు పక్కన పొలాలకు వేసిన ముళ్లకంచెలు, విరిగి పడిన చెట్లు, వ్యర్థాలు వాగు నుంచి కొట్టుకువచ్చి లోలెవల్ కాజ్‌వేకు తట్టుకుని నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. దీంతో వరద పట్టణంలోని ఇళ్లలోకి చేరుతోంది. ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జేసీబీని ఏర్పాటు చేసి వాటిని తొలగించారు.



జేసీబీతో తొలగిస్తున్న ముళ్లకంచెలు, చెట్లు

విద్యుత్ వృథాకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

జిన్నారం(పటాన్‌చెరు): పట్టపగలే విద్యుత్ వెలుగులు శీర్షికన ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. గడ్డపోతారం పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద పట్టపగలే విద్యుత్ వృథా అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. మళ్లీ ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ప్రజా సమస్యలను పత్రికల ద్వారా పరిష్కారమయ్యేలా కృషి చేసిన సాక్షి దినపత్రికకు, చర్యలు చేపట్టిన అధికారులకు మున్సిపల్ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



సమస్యను పరిష్కరిస్తున్న సిబ్బంది

25న ఇందిరాపార్క్ వద్ద నిరసన దీక్ష

జీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్

సంగారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈనెల 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నిరసన దీక్షను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ కోరారు. సంగారెడ్డిలోని సంఘం భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలు అధిక సంఖ్యలో దీక్షకు తరలిరావాలని కోరారు. బీసీ రిజర్వేషన్లలో కొందరికి సందేహాలు ఉన్నాయని వాటిని రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర స్వామి, ముఖ్య సలహాదారులు చంద్రయ్య స్వామి, కార్యదర్శి సుధాకర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీలోని పలు గ్రామాలకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో హైమస్ట్ లైట్లు ప్రారంభించినట్లు బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు జగన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు దాదిగూడెంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి కలిసి హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. అనంతరం జగన్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ఎంపీగా గెలిచిన తర్వాత రఘునందన్‌రావు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. అంధకారంలో ఉన్న గ్రామాలకు వెలుగులు నింపారని కొనియాడారు. మిగతా గ్రామాలకు రెండో విడతలో లైట్లను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, సుధాకర్, అశోక్ కుమార్, దేవేందర్, వీరేష్, లక్ష్మణ్, ప్రవీణ్, రాజు, ఆంజనేయులు, యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు